క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాలు

బి.కొత్తకోట: స్థానిక భరత్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థి ఫయాజ్ మంగళవారం విద్యార్థులకు తన డబ్బుతో 20 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. కరెస్పాండెంట్ పూజారి శ్రీనివాసులు ద్వారా విద్యార్థులకు పంపిణీ చేయించారు. రూ.20వేల విలువైన పుస్తకాలను అందించడంపై ఫయాజ్‌ను అభినందించారు.

కురబలకోట వైద్యాధికారిగా చక్రపాణి



కురబలకోట: మండల వైద్యాధికారిగా చక్రపాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న శ్రీధర్ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇతని స్థానంలో చిన్నగొట్టిగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రపాణిని ఇక్కడికి బదిలీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

గాయపడిన వ్యక్తి ఆస్పత్రికి తరలింపు



సీటీఎం రైల్వేస్టేషన్‌లో గాయాలతో పడి ఉన్న వ్యక్తి

మదనపల్లె రూరల్: మండలంలోని సీటీఎం రైల్వే స్టేషన్‌లో గాయాలతో పడిఉన్న వ్యక్తిని 108 సిబ్బంది మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం సీ.బావికి చెందిన లక్ష్మీనరసింహ(44), సీటీఎం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై తలకు తీవ్రగాయాలతో పడి ఉండగా, గమనించిన స్టేషన్‌మాస్టర్ 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితుడిని ఆస్పత్రికి తరలించగా గాయపడిన వ్యక్తి ఒకసారి తనపేరు లక్ష్మీనరసింహ అని, మరోసారి తనపేరు రామాంజనేయులు అంటూ సమాధానమిచ్చారు. తనను ఇతరులు కొట్టి వెళ్లిపోయారంటూ చెప్పాడు. దీంతో అవుట్‌పోస్ట్ సిబ్బంది తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనకు గల కారణాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

కష్టపడేవారికి బీజేపీలో తగిన గుర్తింపు



మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు

గుర్రంకొండ: పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికే బీజేపీలో తగిన గుర్తింపు ఉంటుందని మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు అన్నారు. మంగళవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగి, అఖిల భారత విద్యా పరిషత్ సైనికుడిగా పనిచేసి పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా నియమితుల కావడం శుభపరిణామన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఆయనకు పార్టీ అధిష్టానం ఉన్నత స్థానం కల్పించి గుర్తింపు ఇచ్చిందన్నారు. ఆయన సేవల్ని అందరు ఆదర్శంగా తీసుకొని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతిర్లశ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, రామాంజులురెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించింది క్వాసీ సీఈ

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రం పెద్దతిప్పసముద్రంలో సోమవారం హంద్రీనీవా ప్రాజెక్టు కాలువ పనులను పరిశీలించింది క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ శేషుబాబు అని ప్రాజెక్టు అధికారులు మంగళవారం తెలిపారు. తెలుగు గంగ సీఈ వర ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదని తెలిపారు. ఉపకాలువల్లో జరుగుతున్న లైనింగ్ పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు

రాజంపేట టౌన్: బీమా చట్టాల సవరణ బిల్లుపై కేంద్రం తీసుకుంటున్న చర్యలకు నిరసనగా ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా అందరూ పాల్గొనాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఆవరణలో బ్రాంచ్ అధ్యక్షుడు పి.సుభాష్‌చంద్రతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేయడం పాలసీదారులకు భారంగా ఉందన్నారు. ఖాళీగా ఉన్న 3, 4వ తరగతి ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పనిభారం అధికమవుతోందన్నారు. పనిభారం పెరిగిన కారణంగా అనేక మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కొత్త పెన్షన్ విధానానికి స్వస్తి పలికి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. రామచంద్ర, సుభాష్‌చంద్ర, చంద్రమోహన్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

రూ. 7.19 కోట్ల ఉపాధి పనులపై

సామాజిక తనిఖీ ప్రజావేదిక

- 61 పనులపై ఏపీడీ ఆధ్వర్యంలో రీ ఎంక్వయిరీ
- రూ.54,000 రికవరీకి ఆదేశాలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో విచారిస్తున్న అధికారులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా పీడీ వెంకటరత్నం ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలోని 25 పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం 1,469 పనులకు రూ.7కోట్ల19 లక్షల 34 వేల 488 రూపాయలు ఖర్చు చేయగా, కూలీలకు వేతనాలుగా రూ.3కోట్ల17లక్షల5 8వేల 176 రూపాయులు, సామగ్రికి రూ.4కోట్ల1లక్ష 76వేల 312 చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై, జూన్ 9వ తేదీ నుంచి 30వ తేదీవరకు 11 మంది డీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఉపాధిహామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 25 పంచాయతీల్లో రూ.54వేలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. రూ.18,500 వేలు జరిమానా విధించారు. 61 పనులకు సంబంధించి ఏపీడీ ఆధ్వర్యంలో రీ ఎంక్వయిరీకి ఆదేశించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో మదనపల్లె రూరల్ మండలానికి చెందిన పలువురు ఉపాధిహామీ కూలీలు, రైతులు తమకు జాబ్‌కార్డులు ఉన్నాయని, పనులు కల్పించాలని కోరితే యాక్టివేషన్‌లో లేనందున నిరాకరిస్తున్నారని, దీంతో హౌసింగ్, ఫారం ఫాండ్, హార్టికల్చర్, పశుగ్రాసం, సోక్‌పిట్‌కు సంబంధించి పనులు చేసుకోలేకపోతున్నామని, జాబ్‌కార్డులు యాక్టివేట్ చేసి పనికి ఆహార పథకం వినియోగించేలా చూడాలని వినతిచేశారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో హౌసింగ్‌కు సంబంధించి బిల్లులను లబ్ధిదారులకు కాకుండా ఇతరులకు ఇచ్చినట్లు విచారణలో తేలడంతో ఇద్దరు ఫీల్డ్‌అసిస్టెంట్‌లను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ తాజీమ ద్రూర్, ఏఈ వెంకటరమణ, ఎస్‌ఆర్‌పీ లోకేష్, డీఆర్‌పీ భారతి, ఏపీఓ సుబ్రహ్మణ్యం, కేశవులు, క్షేత్ర సహాయకులు, అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



సీఎస్‌ఆర్ కళాశాలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు : స్థానిక సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇండియన్ మెడియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకొని హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవాలని వైద్యులు సూచించారు. శరీరంలో ఐరన్ పోలిక్ యాసిడ్, ఇతర సూక్ష్మ పోషకాలు శాతానని శరీరంలో తగ్గకుండా చూసుకోవాలన్నారు. మానవ శరీరము పంచేంద్రియాలతో నిర్మితమైందని, అందులో ప్రాణ వాయువు ముఖ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ మేనేజర్ డాక్టర్ మమతలక్ష్మీ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగవేణి, కళాశాల కరస్పాండెంట్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, ల్యాబ్ టెక్నీషియన్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొర్లు దండాలతో నిరసన



శివుని విగ్రహం ఎదుట పొర్లు దండాలు

మదనపల్లె: పట్టణంలో 28 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం నిరాహారదీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..మీరైనా కనికరించండి అంటూ మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని శివుడి విగ్రహం ఎదుట పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనం పెంచకపోవడం, విధి నిర్వహణ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంపై కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు సాగుతున్నాయి. అయితే తమ డిమాండ్లు తీర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా సమ్మె కూడా చేపట్టిన కార్మికులు మదనపల్లె పట్టణంలో ఇంజనీరింగ్ కార్మికులు అందిస్తున్న సేవలను, పనులను పూర్తిగా నిలిపివేశారు. దీనితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటూ కార్మికులు శివుడి విగ్రహం ఎదుట మొరపెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

రాయితీ డ్రోన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, తదితరులు

కలకడ : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ డ్రోన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి యం.ఆర్.శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండలంలోని కదిరాయ చెర్వు, నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వ్యవసాయ శాఖ తరపున 80 శాతం రాయితీపై డ్రోన్స్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రైతులు ఐదుగురు గ్రూపుగాపేరు నమోదు చేసుకుని రావాలని సూచించారు. డ్రోన్‌ల ద్వారా ఎరువులు, మందులు పిచికారి చేయడానికి ఎంతో అనువుగా ఉంటుందన్నారు. వేరుశనగ పంటను వర్షాధార పంటగా 15వ తేదీ వరకు విత్తుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయని, మురుగునీటి కాలువలు శుభ్రం చేసి విధిగా బ్లీచింగ్ చల్లాలన్నారు. నాలుగు రోజులకోసారి మంచినీరు సరఫరా చేయాలని తెలిపారు. వీధిలైట్లు లేని ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు అభివృద్ధి పనులకే ఖర్చు చేయాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో లతీఫ్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు, అబీద్, కాలేషా, పరమేష్ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



గర్నిమిట్ట పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు



కందుకూరు గ్రామ చావడిలో ప్రతిష్టించిన పీర్లు

కేవీపల్లె : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గర్నిమిట్ట పీర్లచావిడిలో పీర్లు కొలువదీరాయి. మంగళవారం పీర్లను చావిడిలో ఏర్పాటు చేసి అలంకరించారు. పలువురు హిందూముస్లిం సోదరులు పాల్గొని పీర్లకు చదివింపులు చేపట్టారు. మొహర్రం పండుగకు రెండు మూడు రోజుల నుంచి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కందుకూరులో...

పెద్దతిప్పసముద్రం:. మండలంలోని కందుకూరులో పీర్లను కొలువుదీర్చారు. మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల చావడి ఎదుట ఉన్న అగ్ని గుండానికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 4న పెద్ద పీర్ల మెరవణి వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ముస్తాబైన కదిరి పీర్లు

పీలేరురూరల్ : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కదిరి పీర్లు ముస్తాబయ్యాయి. పీలేరు పట్టణం మోడల్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీశైలం నాగభూషణం ఆధ్వర్యంలో కదిరిపీర్లు నెలకొల్పడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం కదిరిపీర్లను కొలువుదీర్చి అలంకరించారు. పలువురు పాల్గొని చదివింపులు చదివించారు.

టమాట కిలో రూ.45

–9 రాష్ట్రాలకు ఎగుమతి

మదనపల్లె: టమాట ధరలకు రెక్కలొస్తున్నాయి. నిన్నటిదాక కూలీ ఖర్చులకు సరిపోని ధరలతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పుడిప్పుడే ధరలు పలుకుతున్నాయి. మంగళవారం మదనపల్లె మార్కెట్‌లో కిలో టమాట రు.45 పలికింది. ప్రస్తుత సీజన్‌లో ఈస్థాయిలో ధర పలకడం ఇదే మొదటిసారి. విచిత్రంగా టమాట దిగుబడులు తగ్గలేదు, ఇంకా పెరుగుతున్నాయి. అయినప్పటికి ధరలు పెరగడం రైతులకు మేలు కలిగిస్తోంది. ఎగుమతులు పెరగడం కారణమైనా గతంలోనూ ఎగుమతులు జరిగాయి. కాగా మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకం టమాట కిలో రూ.45, రెండో రకం కిలో రూ.37 పలగ్గా, సగటు కిలో ధర రూ.42 పలికింది. విక్రయానికి 1,153 టన్నుల టమాట రాగా ఈ మొత్తం టమాట దేశంలోని ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి.

వితంతు పెన్షన్‌లు ఉన్నట్లా.. లేనట్లా..?

కలికిరి: ఎన్టీర్ భరోసా పింఛను పథకంలో భాగంగా 01-11-2023 నుంచి 31-10-2024వ తేదీ లోపు భర్తలు సామాజిక పింఛను పొందుతూ మరణించిన వారి భార్యలకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి మండలంలో 92 మందికి వితంతు పింఛన్లను మంజూరు చేసింది. వీరికి గత నెల 12న పింఛను నగదు ఆయా గ్రామాల్లో కూటమి నేతల చేతుల మీదుగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగునంగా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. లబ్ధిదారులకు కూడా ముందుగా సమాచారమిచ్చారు. కానీ అర్ధాంతరంగా వితంతు పింఛన్ల పంపిణీ వాయిదాపడింది. పింఛన్ల నగదు చేతికందుతుందని ఆనంద పడ్డ వితంతువుల ఆశలు నీరుగార్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛను నగదు పంపిణీ వాయిదా వేశామని, తిరిగి ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే నగదు ఇవ్వడం జరుగుతుందని అధికారులు సర్ది చెప్పారు. ఇలాగే గత నెల గడిచిపోయింది. ఎలాగూ తమకు పింఛను మంజూరైంది కదా జూలై 1న అందుకోవచ్చనుకున్నారు. కానీ వితంతువులకు మళ్లీ ఎదురు చూపులే మిగిలాయి. 1న పింఛను కోసం సచివాలయాల దగ్గరకు వెళ్లగా కొత్త వితంతు పింఛను మంజూరైన వారికి నగదు ఇవ్వడం లేదని, ప్రభుత్వ ఆదేశాల వచ్చాక ఇస్తామని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో ఆశతో వెళ్లిన వితంతువులు నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది.

భూ వివాదం దాడిపై కేసు

ఓబులవారిపల్లె: ముక్కావారిపల్లి రెవెన్యూ పరిధిలోని భూమికి సంబంధించిన వివాదంలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భూ వివాదంతో సీఎం బలిజపల్లి గ్రామానికి చెందిన సాబయ్యగారి హరీష్‌పై కొందరు ఇటీవల దాడి చేయగా రాజంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



ప్రయాణికుడి చేత లక్కీడిప్ తీయిస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీలో బస్సుల్లో ప్రయాణం సురక్షితమని మదనపల్లె ఆర్టీసీ–1డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండులో మదనపల్లె–తంబళ్లపల్లె మార్గంలో బస్సులలో ప్రయాణించిన ప్రయాణికులకు బహుమతులు ప్రకటించిందని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల టిక్కెట్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి,న గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ప్రయాణికుల కోసం కొత్త బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. చిల్లర సమస్య లేకుండా ఈపోస్ ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా టిక్కెట్టుకు చెల్లించవచ్చునన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి ఎస్.రెడ్డమ్మ, రెండవ బహుమతి రత్నమ్మ, మూడవ బహుమతి రమణమ్మలు డిపో వద్దకు వచ్చి బహుమతులు తీసుకుపోవాలని కోరారు. అనంతరం డిపో గ్యారేజీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. మే నెలలో ఈపీకె 41.08, ఓఆర్ 74.99, కెఎంపిఎల్ 5.48 వచ్చి రీజియన్‌లో డిపో మొదటి స్థానం నిలిచిందన్నారు. సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె రోటరీక్లబ్‌కు అవార్డులు



మదనపల్లె రోటరీక్లబ్ సాధించిన అవార్డులను చూపుతున్న సభ్యులు

మదనపల్లె రూరల్ : మదనపల్లె రోటరీక్లబ్‌కు 2024–25 సంవత్సరానికి సంబంధించి పలు విభాగాల్లో అవార్డులు అందినట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సూర్యప్రకాష్ తెలిపారు. మంగళవారం స్థానిక రోటరీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...పోలియో నిర్మూలన, యూత్ సర్వీస్, పబ్లిక్ ఇమేజ్, ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ, క్లబ్ సర్వీసెస్‌కు సంబంధించి 4 స్టార్ రేటింగ్‌తో అనేక అవార్డులు మదనపల్లె రోటరీక్లబ్ సొంతం చేసుకుందన్నారు. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగిస్తూ, రాబోయే కాలంలో రోటరీ సభ్యులు, పట్టణ ప్రజల సహకారంతో... మరింత ఉత్సాహంతో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నిసార్‌అహ్మద్, సభ్యులు పీఎస్.చైతన్య, పృథ్వీరాజ్, డాక్టర్.బీవి.రమణ, దేవతా శంకర్, టౌన్‌బ్యాంక్ సీఈఓ పెరవలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌బాబు



పౌష్టికాహారం కిట్‌ను అందజేస్తున్న వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: క్షయ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు పాఠశాలలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెలుగు సంస్థ పది మంది టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పౌష్టికాహారంను పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులను పౌష్టికాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. మానవతదృక్పదంతో ఆదుకోవాలన్నారు. క్షయవ్యాధి పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. అనుమానం ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు.టీబీ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి వెలుగు సంస్థ మైక్‌ను డొనేషన్‌గా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, టీబీ యూనిట్ ఉద్యోగులు ప్రభాకర్, దయాలన్, శాంతి, వనజకుమారి, సుశీల,తరుణ్ పాల్గొన్నారు.

విద్య, పాఠశాల అభివృద్ధికి కృషి



ఉపాధ్యాయిలు వైవీ రమణ, ఖాజాఫీర్‌లను సన్మానిస్తున్న కత్తి నరసింహారెడ్డి, తదితరులు

కలకడ : విద్య, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు వైవి రమణ, ఖాజాఫీర్ ఎనలేని కృషి చేశారని మాజీ ఎమ్మెల్సీ, కత్తి నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు వైవి రమణ, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె ఉన్నతపాఠశాలలో పదవీ విరమణ పొందిన యంఎస్ ఖాజాఫీర్‌లను మంగళవారం కె.బాటవారిపల్లె ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ తరపున సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, శ్రీనివాసులురెడ్డి, సరస్వతిరెడ్డి, మానవత సంస్థ చైర్మన్ పివినాయుడు, గంగాద్రినాయుడు, పివి రమణ, భాస్కర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కె.లక్ష్మిరెడ్డి, లక్ష్మన్న, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాట్ చికిత్సలతో టీబీ వ్యాధి నయం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తంబళ్లపల్లె: డాట్ వైద్య చికిత్సలతో టీబీ వ్యాధి పూర్తిగా నయమవుతుందని, సమష్టి కృషితోనే సాధ్యమతుందని టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణనాయుడు తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది. టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధిని గుర్తించేందుకు గళ్ల పరీక్షలు, డాట్ మందులను క్రమం తప్పక సక్రమంగా వాడకం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి విషయాలను వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గళ్లపరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా చేస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. టీబీ నిర్మూలను అందరం సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి, ల్యాబ్ సూపర్‌వైజర్ భూపతి,సిహెచ్‌ఓ కీర్తి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి స్థలం కేటాయించండి

జిల్లా దేవదాయశాఖాధికారికి వినతి



జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్‌కు విన్నవిస్తున్న కోళ్లబైలు కాలనీవాసులు

మదనపల్లె రూరల్ : కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో ఆంజనేయస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయింపునకు సిఫారసు చేయాల్సిందిగా జిల్లా దేవదాయశాఖాధికారి సి.విశ్వనాథ్‌కు కాలనీవాసులు కోరారు. మంగళవారం జిల్లా దేవదాయశాఖాధికారి సి.విశ్వనాథ్ కాలనీవాసుల వినతిమేరకు తహసీల్దార్ కిషోర్‌కుమార్ రెడ్డికి సిఫారసు చేస్తూ లేఖ పంపారు. కోళ్లబైలు పంచాయతీ సర్వేనెంబర్.614/2లో 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి కోరుతూ గ్రామస్తులు కోరారన్నారు. ఆ మేరకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి నివేదిక పంపాల్సిందిగా తహసీల్దార్‌ను కోరారు. లేఖ నకలును దేవస్థాన ధర్మకర్త వై.శ్రీనివాసులురెడ్డికి పంపారు.